

పార్వతియనుతాపము

రాయసం వేంకటశివుఁడు గారు

(సంపుటము ౨. సంచిక ౫ తరువాయి)

౭. శాంతినికేతనము

సీ. శమదమోన్నతులకీ చతురుఁడాధారంబు-
దాక్షిణ్యమునకు నీతండు చోటు.
—ఉత్తరరామాయణము.

ఆనాఁటిరాత్రి నేరెడువలసలో భార్యచే నిరసింపఁబడిన విశ్వనాథము, ఆగ్రహోద్రిక్తచిత్తుఁడై గర్వమునకు ప్రాయశ్చిత్తముగ తనభార్యను కలకాలమును సాంసారికసుఖము నందకుండఁ జేయవలయు నని సంకల్పించెను. అట్టిసతి చెట్టవట్టిన పాపమునకుఁ బ్రతీకారముగాఁ దానును గృహస్థజీవితమునకు వెలియయ్యెదనని ప్రతినవట్టెను. రైలుస్టేషను చేరువఱకును, తానెక్కడకుఁ బోనున్నదియు విశ్వనాథమునకుఁ దెలియదు. రెయిలుప్రయాణమునందును వాని మనసున కారాటము తగ్గకుండెను. మఱునాఁటి యుదయమునకు వానిమనస్సు కొంతమెత్తవడెను. తా నేయిడుమలఁ బడినను, తన యాగ్రహానలమున కబలయగు భార్య జీవితము నాహుతిచేయుట తగదని విశ్వనాథమునకుఁ దోఁచి పార్వతి యనుతాపమునొంది చక్కఁబడినచో దాంపత్యసుఖము తిరిగి తమకు లభింపఁగలదని యామెకు లేఖ వ్రాసి, ఖడ్గపురితపాలపెట్టెలో వైచెను. ఇట్లు మనసు కొంతశాంతిపఱుచుకొని, పరిపూర్ణశాంతి నొందు కోరికతో నతఁడు బోల్పూరునందలి శాంతినికేతనము చేరెను.

ఆయాశ్రమమందలి వృక్షరాజముల నీడలను విద్య నేర్చుకొను యువకుల యుత్సాహమును గనిపెట్టుచును, అందలి బోధనపద్ధతులకును సామాన్యవిద్యాలయములందలి వానికిని గలభేదవిస్తారమును, విశ్వనాథము తన మనోవ్యధ నుపశమించుకొనఁజూచెను. కాని, దుఃఖము వాని మనఃక్షేత్రమున వ్రేళ్లుపాఱియుండెను. సాధారణ చికిత్సలవలన నసాధారణవ్యాధులు నివారితములు గావని యతఁడిపుడు గనిపెట్టెను.

విశ్వనాథునికి గత్యంతరమేమి? రవీంద్రుఁడు రవీంద్రునివలెనే సతతము కవిత్వవియత్పథముననే చరించుచుండును—శిష్యులు నొజ్జలును నియుక్త కార్యములందే రేయింబవళ్లు గడపుచుందురు. విదేశీయులగు వారిచెవులకుఁ దనతెలుఁగుమాటలవలెనే, వారిహృదయములకుఁ దనమనస్తాపము దుర్గ్రాహ్యమని విశ్వనాథము గనిపెట్టెను.

ఒకనాఁడు విశ్వనాథము మనఃక్లేశములబారినుండి తన్ను రక్షింపగలవారీవిశ్వమున లేకుండుటకు వగచి, పెద్ద సాలవృక్షమునీడను దీర్ఘవిచారములోఁ గూర్చుని యుండెను. వాని మనమునకపుడు ముల్లోకములు దిర్దిరఁదిరుగునటులఁ గానిపించెను. తన కొండవీటిసీమ, బాల్యకాలపు విద్యాపరిశ్రమము, మామగృహవైభవము, గర్వముతో మిడిసిపడెడి గృహిణి, నెకలపాలయిన తలిదండ్రులు, పాడువడిన పైరుపంటలు, సగముసాగిన యుత్తమోద్యమములు,— ఇవియన్నియు వాని మనోనేత్రము నెదుటఁ దాండవింపఁదొడంగెను. ఇన్నికష్టముల కగ్గమైన తన కెవరు శరణమా యని యాయువకుఁడు దైన్యము నొంది, ముఖము వంచుకొనియుండెను. కన్నులనుండి బాష్పజలము బొటబొట రాలుచుండెను.

అపుడొక మనుజుఁడు వెనుకనుండి వచ్చి, వానిభుజముమీఁదఁ జేయియిడి, "భాయీ! నీవిచారమునకుఁ గారణమేమి?" యని యడిగెను. అతఁడాయాశ్రమపరిచారకులలో నొకఁడు. పాలిపోయిన ముఖముతో చింకిగుడ్డ చేతఁబట్టి, అచటి చిత్తరువుదారములను వీఁడు చిమ్ముచుండెను,

వాఁడు. ఇట్టివాఁడా విశ్వనాథము సంగతి యార్చువాఁడును దీర్చువాఁడును? "నా బాధలు దేవుని కెఱుక, నీదారిని నీవు పొమ్మ"ని విశ్వనాథము హిందీతో వానికిఁ జెప్పి వైచి, తలవంచుకొని తిరిగి తుదిలేని తలంపులలో మునిఁగి పోయెను.

కాని యా పరిచారకుఁడు, ఒకకన్ను విశ్వనాథము మీఁదనే యుంచి, వేవేగముగఁ దనపని ముగించుకొని, "మిత్రుఁడా! ఇదిగో వచ్చితిని. నాకిఁక తీఱికయే. నీ సమాచారము చెప్పుము!" అని పలికెను. "ఈ సేవకాధముఁడా నా కాత్మశాంతి చేయువాఁడు! ఆహా, విద్యార్థికుఁడైనను నా కీగతిపట్టినది!" అని విశ్వనాథము విధినిమాఱుము, తనయందున గూరుచుండు మనుష్యునితో నిష్టము లేకయే మాటాడ మొదలిడెను. కాని, మాటాడిన కొలఁదిని, వానికి విద్యాపరిచితియు, ఇంగ్లీషుభాషాపరిజ్ఞానమును గలిగియుండుటకు విశ్వనాథ మాశ్చర్యపడెను.

విశ్వనాథున కాశ్చర్యము గలిగించినవి యా పరిచారకుని భాషాప్రవీణతయు, లోకానుభవమును. వాని సంగతి చూడఁగా బ్రాహ్మణునికి బోధచేసిన ధర్మవ్యాధుని పురాణగాథ విశ్వనాథమునకు జ్ఞప్తికివచ్చెను. ఏది యెట్లులుండినను, ఈజనారణ్యముమధ్య తన సేమ మారయువాఁ డొకఁడైన నునికి విశ్వనాథమునకుఁ గొంత దుఃఖోపశమనము గావించెను.

ఈపరిచారకుఁ డెవ్వఁడని విశ్వనాథము పిమ్మట కొందఱినడుగఁగా, "బడేదాదా" అంద్రు "బడేదాదా" యని మందహాసము చేయుచు వంగీయులందురే కాని, యా సమాధానము వానికి తృప్తి నొసఁగలేదు. మఱునాఁడు తనకు వర్తమానము రాఁగా, విశ్వనాథము 'బడేదాదా' దర్శనమునకు వాని గదిలోనికిఁ బోయెను. అచట 'బడేదాదా' శుభ్రమగు వస్త్రములు కట్టుకొని కుర్చీలోఁ గూర్చుండి, స్వాములవారివలె నుండెను! గదిగోడమీఁద "ఆంధ్రూసు గారు" అను చిత్రితాక్షరములుగల ఫలకము గట్టఁబడి యుండెను!

ఢిల్లీలో ప్రప్రథమమున సుప్రసిద్ధక్రైస్తవ మతగురువుగనుండి, హిందూదేశీయుల యదృష్టవశమునఁ దన యున్నతపదవిని త్యజించి, భరతఖండమె తన జన్మభూమిగను, భారతీయులే తన యనుఁగుసోదరులుగను జేకొని స్వార్థత్యాగము చేసి, హిందూదేశోద్ధరణమునకై పాటుపడుచుండు ఆంధ్రూసుమహనీయుని చూచి, విశ్వనాథము వారిపాదములకెరఁగి, తనతప్పుగాచి పాప విముక్తునిగఁ జేయుఁడని వారిని వేడెను. ఆంధ్రూసు మహనీయుండు విశ్వనాథమును గౌఁగలించుకొని, తన కాతఁడుగావించిన యపరాధమేమియు లేదని చెప్పి, పావనమూర్తియగు భగవంతుఁడే ముక్తిప్రదాతగాని తనవంటి పాపిగాఁడనినొక్కి చెప్పెను. సౌరభకోమలత్వములు పుష్పరాజమునందువలె ప్రతిభాపవిత్రతలు ఆంధ్రూసుమహనీయునందుఁ గన్పట్టుచుండెను. సాధుత్వసౌభ్రాత్రములు ఆతని పలుకులనుండియు చూపులనుండియు నలుదెసలకు బ్రసరించుచున్నట్లు లుండెను. శాంతినికేతనమువారికేకాక, సర్వజనులకును ఇతఁడు వంద్యుఁడగు పెద్దతండ్రియే యని విశ్వనాథ మిపుడు విశ్వసించెను.

మిత్రుఁడు మిత్రునికివలెనే విశ్వనాథము ఆంధ్రూసు మహనీయునికిఁ దన రహస్యములను దెలియఁబఱిచెను. విశ్వనాథముయొక్క గురువులలో ఆంధ్రూసె యుత్తమ గురువు. గురూపదేశము సామాన్యముగ నతిగూఢముగను దుర్గ్రాహ్యముగుబీజాక్షరరూపముగను నుండెడిమంత్రము. ఈగురూపదేశమన్ననో, ఎల్లరికిని జేటతెల్లముగఁ దెలియు ప్రేమమంత్రమె! ప్రేమయే యాంధ్రూసు తత్త్వబోధన సారము, మహనీయమైన యా యనఘుని ధర్మజీవిత సారము!

వట్టిసిద్ధాంతములు నేర్చుకొనవలెనని విశ్వనాథ మింతదూరము రాలేదు. కళాశాల దినములలోనె వానికి తర్కవేదాంతములు కొట్టిన పిండియయ్యెను. ఉపన్యాసములు సద్గ్రంథపఠనములు విశ్వనాథుఁడు కాంక్షింపలేదు. వానికిఁ గావలసినది, శాంతిదాయకము పవిత్ర మార్గదర్శకము నగు నుత్కృష్టజీవితమె. వీనిని బ్రసాదింపఁగలయది యీశ్వరకటాక్షముతోపాటు, సద్గురువునొద్ద శుశ్రూష. విశ్వనాథము కన్నుల కట్టి యుత్తమగురువు ఆంధ్రూసె. ఆంధ్రూసుగారి జీవితము ధర్మజీవితము, ధారాళ జీవితము. ఆయన పలుకులకును పనులకును వీసమంతయేని వ్యత్యాసము లేకుండ వ్యవహరింపఁగల పురుషుఁడు. ప్రేమ మూర్తి. నిష్కల్మషహృదయుఁడు. ఋషి పుంగవుఁడు

ఆంధ్రహాసుగారిబోధన తత్త్వమునఁ గొన్నిచిత్రములు విశ్వనాథుని కన్నులకుఁగన్పట్టెను. ఆయన,ఎట్టి పాపితో నైనను చెలిమిచేసి, వానిపాపములు గనుగొని, పాపితోఁ గలిసి పరితపించి, ప్రార్థించి, పాపబీజములను వానియాత్మ నుండి పెఱికివైచి, వానిస్థానమున పవిత్రాదర్శములు నాటింపఁగల తపస్సంపన్నులు. వ్యక్త్యవస్థా భేదముల ననుసరించి మెలఁకువతో నాత్మశాంతి నొసఁగూర్పఁగల సమర్థులు—క్షమయందుఁగల యొకవిధమగు సూక్ష్మదృష్టి ప్రభావమున నితరులను బీడించు వ్యసనములు గ్రహించి, తగు చికిత్స యొనరింపఁగల ప్రతిభావంతులు—చికిత్సకు వలయు శాంతిప్రేమాదు లపరిమితముగఁ గల మహాత్ములు. ఆత్మోపలబ్ధి గావించు తరుణమున,పాపినేత్రములకాయన చికిత్సచేయువైద్యునివలెఁగాక, స్తన్యమిచ్చు తల్లివలెను, కలసియాడెడి మిత్రునివలెను గానిపించి, ప్రేమమార్గము ననె తగనోపాయము గలుగఁజేయఁగల మహానిపుణులు. కావుననె విశ్వనాథము, ఆంధ్రహాసుమహనీయుని సహవాస శుశ్రూషలవలన మనసు కలఁకదేఱి,వారివలన ఆత్మపవిత్రతకును,ఆత్మాభివృద్ధికిని వలయుసాధనములు గ్రోలి, వానినిఁ దన యనుభవమున కలవఱుచుకొనుచు, ఆంధ్రహాసునే ప్రియజనకునిగను, మిత్రవర్యునిగను, గురూత్తముని గను భావించి, వారియెడల నపార భక్తివిశ్వాసములు గాంచియుండెను.

ఆజ్ఞోల్లంఘనము చేసెనను నలఁతి మిషచే ధర్మపత్నిని విడనాడుట యధర్మమని విశ్వనాథ మిపుడు గ్రహించి, జీవితమం దాయబలకుఁ దాను వృథాపరితాపమును గల్పించుట కెంతయు వగచెను. ఒకవేళ తనవిమర్శయం దాలేమ గ్రుంగినచో, ఆయపయశస్సును దన మెడనే నైచుకొన నతఁడు సిద్ధపడెను. బంధుల నంపటిని యలజడి పాలుచేసిన పాపము తానే మూటఁగట్టుకొనఁ బూనెను. తనకోరికప్రకార మొకవేళ భార్య యసాధారణ ప్రజ్ఞాధైర్యములు పూని కార్యసాధనమున విజయమందినచో సామాన్యస్త్రీ నట్టి యనన్యధైర్యవతిగ మార్పఁగల తన కుశాగ్రబుద్ధి జనులపొగడ్తల నందఁగలదని యతఁడు సంతసించెను. ఏదియెటులుండినను, శీఘ్రమె స్వదేశమునకుఁ బోయి, తనవారికిఁ దాను గావించిన క్షోభమును తొలగించి, ఆంధ్రహాసు మహిమాతిశయమును బ్రకటీకృతము చేసి, జనులను ధన్యులఁ జేయవలయునని విశ్వనాథు డుద్దేశించెను. గురువు దీనికిసమ్మతించెను. త్వరితకాలములోనె మార్గమధ్యమునఁనున్న కాకినాడలోఁ గూడు దేశీయమహాసభనుజూచి, మఱి యింటికిఁబోవ విశ్వనాథము తలంచియుండెను.

౮. విశ్వనాథము

"తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను,
దీనులఁ గావఁ జింతించువాఁడు."

భాగవతము.

దేశీయమహాసభ కొన్ని దినములకుఁ గూడు ననఁగా, విశ్వనాథము కాకినాడపురముచేరెను. అచట సభాప్రయత్నములు చేయఁబడుచుండెను. పాకలు పందిళ్లువేయఁబడుచున్నవి. నీటి కొళాయిలు దీపపుస్తంభములు నమర్పఁబడుచున్నవి. ఒకప్రక్క వంటసామగ్రులు గూర్చుచున్నారు. వేఱొకప్రక్క సేవకులను నియమించుచున్నారు. సభ దినములలో గాంధినగరమును గావలికాచుటకైచ్ఛికభటులు చేర్చుకొనఁబడుచుండిరి. ఈసన్నాహము నూరకమాచిపోవుటకు వచ్చువారుసైతము, అమితోత్సాహమున నాభటసమూహమునఁ జేరుచున్నారు. లేదా, తమయోపినంత సాహాయ్యమును జేయుచున్నారు.

సామునేర్చుకొనుచున్న యైచ్ఛికభటులు, తమ ముందు సాగిపోవుచున్న విశ్వనాథమును రెండుమూఁడు సారులు పరికించి, అతఁడును దమలోఁజేరిన మేలని తలంచుచువచ్చి వాని నాహ్వానించిరికాని, తనకేదో యితర వ్యాపారమున్నదను మిషతో నాతఁడు తనదారిని దాను బోవుచుండును. ఇతఁడట్లు చేయుటకుఁ గారణమేమి? "దేశసేవకే నేను వేఱుపడియుండెదను. ఐచ్ఛికభటుల సహాయార్థమె నేను వారిని జేరకుందును. ఏదైన నొక సమాజమునఁ గూడినతోడనె, సామాన్యముగ వ్యక్తి స్వతంత్రతలు నశించును. సమాజోద్ధరణమునకు వలయు శక్తిస్వేచ్ఛలు తొలఁగిపోవును. బయటనుండియు దేశసేవోద్యమమునకు నేను జేయూఁత నొసంగెదను!" అని విశ్వనాథము మనమున నిశ్చయించుకొనెను.

ప్రేక్షకులందఱు భోజనాది కార్యములకై విడుదులు విడిచిపోవునప్పుడును, సభలోని కరిగినప్పుడును,

వారిసొత్తులను గాపాడవలయువా రైచ్ఛికభటులే. వీరి లోఁబెక్కండ్రు బాలురు. చర్చలువినవలయుననియు, చిత్రములు చూడవలయుననియు నొక్కొకభటుఁడు, తన కార్యభారము దగ్గిఱవానిమీఁద వైచి, పోవుచుండును. ఈమాత్రము సందుకై వేచియుండు చోరున కిది మంచి సమయము. కాని యట్టి సమయమున విశ్వనాథుని యాకార మచటఁబొడకట్టును. పేరున కుద్యోగము లేకున్నను, పరిశ్రమమునకు మాత్ర మాయువకుఁడు ఏయైచ్ఛికభటునికిని దీసిపోఁడు. అతని సహాయమున నెందఱో తల్లులు దారితప్పిపోయిన తమపిల్లలను దిరిగి కలసికొని, వానికి దీవనలిడిరి. ఏమఱియున్న జవ్వని మెడలోనినగ సంగ్రహింపనూనిన యేచోరుని నిపుణతయు విశ్వనాథుని కనులఁగప్ప లేకుండును. తొందరలోఁ బారవైచుకొనిన వస్తువులు విశ్వనాథుని సాహాయ్యమువలనఁ దమకు లభింపఁగా, జనులు సంతోషమున మిన్నందుచుండురు. కావున నైచ్ఛికభటులు, అనుక్షణమును విశ్వనాథుఁడు చేయుచుండు సంఘసేవాకార్యము గన్నులారఁజూచి, తమవాఁడు కాకున్నను తమవాఁడే యని, వానియెడ నత్యాదరబుద్ధివహించియుందురు.

సభజరిగిన దినములలో గాంధినగర రక్షకత్వమును దొరతనమువా రైచ్ఛికభట సమూహమునకే వదలిరి. రేయుంబవళ్లు వంతులువేసికొని యైచ్ఛికభటులె యాప్రదేశమునుగాచి, మొత్తముమీఁద నెంతో శ్లాఘనీయముగఁ దమ కృత్యములు నెఱవేర్చిరి.

మొదటిదినములలో నొకనాఁటి రాత్రి గాంధినగరము నిశ్శబ్దముగ నుండెను. "ఘారాహుషార్! గాంధీమహారాజ్!" అను చోపుదారికేకలు ఉద్యోగుల చౌకు నుండి యారంభమై, యంచలమీఁద నగర మెల్లెడల వ్యాపించుచుండెను. అపుడేదో యొకమూల రొద వినవచ్చెను. 'ఘారాహుషారు' కేక లంత బిగ్గరగ వేయుచును, ఈలలు వేయుచును భటు లధిక జాగరూకత గలిగియుండిరి. చీమ చిటుక్కుమనెనా, ఎవరువారని నలుదెసలనుండి ప్రశ్నలు గురియుచుండును. ఇటులుండ, చోరు నొకనిబట్టుకొని యైచ్ఛికభటులు కొందఱు ఉద్యోగుల చౌకువద్దకుఁ గొని వచ్చిరి. అచ్చటి మైదానమునఁ బాతిన కొయ్యకొకదానికి వాని నంటఁగట్టిరి. వానిని గుర్తించుట కంతదీపములు దెచ్చి భటులు ప్రేక్షకులును చుట్టునుజేరి. "ఓహో! వీడే మిఠా యిదొంగ!" యని యొకఁడనగా, "నిన్న మసలివాని వస్త్రము దొంగిలించినవాఁడు వీడె!" యని వేఱొకఁడు పలికెను. వయస్సునఁచిన్న యైనను వృత్తిమాత్రము పెద్దదే యని నలుగురును వానినిగుఱించి చెప్పుకొనసాగిరి. "నా గడియారము నిన్న నపహరించిన దొంగ యిడుగో!" నని యొక్కరును, "ఔను! చేయి చిక్కినను దప్పించుకొని పోయె"నని మఱియొకరును వానిమీఁద నపరాధస్థాపనఁ జేసిరి. చోరబాలుని వారంత పిడికిటఁబొడుచుటకును, బెత్తముతోఁ గొట్టుటకును ఆరంభించిరి. సొమ్ము పోఁగొట్టుకొనిన వేఱొకమనుజుఁడపుడువచ్చి, దొంగ నానవాలు పట్టి, చేతిబెత్తముతో వానిముఖముమీఁదఁ గొట్టెను. ఆ దెబ్బతగిలెనా, బాలచోరుఁడు మొగము తిరిగి నేలఁబడవలసినదే! ఎవరికి వారొత్తిగిల్లి యుండిరి. ఐచ్ఛికభటు లూరక చూచుచుండిరి!

అచోరబాలకుని రక్షించుటకై దైవ మంపెనా యనునట్టుగ, కనుమ్రాల్చునంతలో నొకయువకుఁడు వచ్చి బెత్తమున కడ్డుపడెను. బెత్తపుదెబ్బ కాతని దేహమునఁ బెద్దబొబ్బలేచెను! ఐన నతఁడేమియుఁ బలుకక, చోరుని శరీరమున నింకఁ బడనున్న దెబ్బలను దప్పించుటకై తన చేతులు వాని మెడచుట్టును మెలివైచియుండెను. తనపర్ణశాలనుండి యంత దేశభక్తుఁడు లేచివచ్చి, "మీరు చేయుచున్నది రాక్షసకృత్యము! ఇట్టి క్రూరకృత్యమున కొడిగట్టువారా స్వరాజ్యభాగ్య మనుభవించుట కర్హులు! ఈ దొంగకుఁ జూపిన దౌర్జన్యమునకు మీరు ఉత్తరవాదులు. చూడుఁడేమి జరుగునో!" యని గంభీర వాక్కులతో నాగ్రహాగ్ని వారిమీద నపుడు ప్రయోగింపకుండినచో, ఘోరకృత్య మారాత్రి యచట జరిగెడిదే!

ఇట్లాచోరుని కభయహస్త మిచ్చినది విశ్వనాథుఁడు. దేశభక్తుని చేతిసైగచే జను లెవరిదారిని వారు పోఁగా పాపమా చోరబాలకుఁడు కుప్పగూలినట్లు నేలఁగూలెను. ఇది మిషయని యొకరిద్దఱు భటవరు లనినను, వారిమాట లాలకింపక, విశ్వనాథుఁడు వానిని దనమూఁపున నుంచుకొని తన విడిదలకుఁగొనిపోయెను. దీపపు వెలుఁగున నా బాలకుని దేహము పరీక్షింపఁగా, చిన్నగాయములు, పెద్ద దెబ్బలు ననేకములు గానవచ్చెను. త్రాళ్లకట్టులయొద్దను

పెదవులనుండియు రక్తము స్రవించుచుండెను. మాటాడుటకైన శక్తిలేక వాఁడు శోషిల్లుటచూచి, విశ్వనాథము వానిని దన మంచముమీఁద బండుకొనఁబెట్టి, వాని కపుడు వేడిశాఖ చేసియిచ్చెను. శస్త్రవైద్యుని బిలుచుకొనివచ్చి వానిగాయములు కడిగి, మందు పట్టించెను.

ఆ మఱునాఁడు బాలకునిగుఱించి విశ్వనాథము మిక్కిలి యలజడితో నుండెను. భయోద్రేకముచేతను, గట్టిదెబ్బలు తగులుటవలనను, చోరబాలకునికి తీవ్రజ్వరము సోఁకెను. "నాయనా! కొంచెము లాభమునకై నీవీ చెడుపనిచేసి చేటుతెచ్చుకొంటివిగదా! నీకన్నతల్లి యిట నుండిన నీకోస మెంత శోకించునో! పరువము లగు నా చేతులలోఁబడ్డ నీకేమిసౌకర్యము గలుగును! తండ్రీ! ఈ మందు త్రాగు- ఏడువకు- నీకు వచ్చిన భయము లేదు, నాయనా! నిన్ను నేను గాపాడెదను. ఈసోడా కొంచెమైన త్రాగిన మంచిదని వైద్యుడు చెప్పుచున్నాఁడు. విసనకఱ్ఱతో తిరిగి విసరెదనులే! కాళ్లింకొకసారి పట్టనా? గాయముచోటనే తిరిగి చెయివేసి నీకు నొప్పి కలిగించినాను, నాది మాయమఱుపులే!" అని విశ్వనాథము కన్నతల్లివలె నా బాలకుని మంచము కనిపెట్టుకొని యుపచారములు చేయుచుండెను.

రాత్రి రెండుజాములకు దేశభక్తుఁడు అచటికి వచ్చి క్రిందటిరాత్రి గాయములు తగిలిన బాలునిగుఱించి కుశలప్రశ్న వేసి, "వీనిని చూడవలెనని యీనాఁ డనేకపర్యాయములనుకొంటిని. కాని యిప్పటికిఁ దీఱినది.!" అని పిల్లవానియొంటిమీఁదఁ జేయివైచి, "అయ్యో! తీవ్రజ్వరము వచ్చినదే! మందిచ్చినారా? మీకు సహాయము లేదే! భోజనము చేసినారా?" యని గ్రుచ్చిగ్రుచ్చియడిగి ఆదినము విశ్వనాథము నిరాహారుఁడగుట తెలిసికొని, తానింకను భుజింపకున్నను, విశ్వనాథము భోజనము చేసిన పిమ్మటనే తానచటనుండి కదలెదనని పట్టుపట్టి, విశ్వనాథముచే నన్నము దినిపించెను.

౯. ఉంగరము దొరకుట

క. మానుగ నీముద్రికగని
మానసమున సంతసించి మారుతసుత! ని
న్నేనటఁ బుత్తెంచితినని
జానకి సత్కృతులు నీకు సమ్మతిఁ జేయున్.

భాస్కరరామాయణము.

విశ్వనాథ మిప్పుడీబాలకుని సేవయందు విశ్వమంతయు మఱచినటు లుండెను. వానిని బుజ్జగించుచును వేళ మాడుచును, ప్రోత్సహించుచును, ఎట్టులో వాని కౌషధ మిప్పించి, పథ్యపానములు నడపెను. విశ్వనాథము పరిచర్యలచేఁ బునర్జీవితుఁడైన యాపిన్నవానికి, కనుల కగపడని తలిదండ్రులు కల్లగాను, కాచుచుండెడి యాతఁడె తల్లియుఁ దండ్రియు నగుట సత్యముగాను జూపట్టెను. ఆ బాలకుని కంటి కిపుడు విశ్వనాథమొక నిమేషము గానరాకుండెనా, అతఁడు విశ్రాంతి విహీనుఁడగును. విశ్వనాథమె వానికి ప్రాణము. వాని చిఱునగవె బాలునికి స్వర్గము; వానికోపమె ఘోరరౌరవము.

ఇప్పుడాబాలునికిఁ గొంతస్వాస్థ్యము గలిగినను ఇంకను బలహీనముగాఁనే యుండెను. ఒకనాఁడు విశ్వనాథమును వాఁడు "నాన్నా!" యని చేరఁబిలిచి, ఆయన చేతిని దన చిన్నిచేతులతోఁ దాఁకి, తనజుట్టులో దాఁచి యుంచిన యొకయుంగరమునుదీసి, వానిచిటికెనవ్రేలి కది పెట్టెను. దీని కాశ్చర్యమంది విశ్వనాథము, "ఈయుంగరమెక్కడిది? ఈదొంగసొమ్ము నాకెందుకు?" అనిదానిని దీసివేయఁగా, బాలకుఁడు కంటనీరుపెట్టుకొని, విశ్వనాథమీయుంగరము పెట్టుకొనినఁగాని తానేడుపు మాననని చెప్పివేసెను! బాలకుని యారోగ్యప్రాప్తియె ప్రధానముగఁ జూచుకొనుచున్న విశ్వనాథ మపుడు "సరే!"యని చెప్పి, అది పరిశీలించిచూచెను.

అది తాఁ బూర్వమెపుడో చూచినదానివలెఁ దోఁచి విశ్వనాథమింకను శ్రద్ధతోఁ దానిని బరీక్షింపఁగా, పూర్వము తాను చెన్నపురియందుండు కాలములో, ఒకనాఁడు మిత్రులతో వీకంసీ దుకాణముపగ్గఱకుఁబోయి, సన్నకెంపుల నగిషీతో నక్షరములు బంగరుంగరమునఁ గూర్పఁబడుట వీక్షించి, తనభార్యయగు పార్వతిపేరట్లు మిద్దటుంగరమునఁ గెంపులతోఁ జేయించుట వానిస్ఫురణకు వచ్చెను. ఉంగరము మీఁద "పార్వతి" యనుపేరు ఆనాఁడు కెంపులతోఁ గూర్పఁబడినది వాని కిపుడు గానఁబడెను. ఈయుంగరమిచటికి ఘాగతమేమి? పార్వతి యూ

మహాసభకువచ్చి యుంగరమును గోలుపోయెనా? యని విశ్వనాథ మాలోచింపఁ జొచ్చెను.

ఉంగరపు సమాచారమేమని విశ్వనాథముడుగఁగా తానారాత్రి జరిగించిన చౌర్యవృత్తాంతమును జెప్పి అపుడా స్త్రీ వ్రేలినుండి గ్రహించిన నగయే యిదియని బాలకుఁడు వచించెను. ఈయుంగరము మూలమున తనసతి జాడలు గనుగొనవచ్చునని పెద్దయాశతో విశ్వనాథము దానిని భద్రముగదాచి యుంచెను.

ఒకనాఁడు ప్రొద్దుననె స్త్రీప్రతినిధుల శిబిరమున కొక బాలుఁడువచ్చి, అచటి ముందువెనుకనున్న ద్వారములఁ బరిశీలించుచు నడయాడుచుండెను. ఆప్రాతఃకాలమున జరుగనున్న సభలకుఁ బోవు సన్నాహముమీఁద నక్కడివా రుండిరి. బాలకునిచర్యలు గనుగొని యనుమానపడుచున్న కొందఱుస్త్రీలు, వానిని, "నీవిచటికేల వచ్చితివి ? ఎవరు కావలయును?" అని ప్రశ్నించిరి. "పార్వతమ్మగారున్నారా?"యని బాలకుఁ డడుగఁగా, "ఏపార్వతమ్మగారు?" అని వానిని బ్రశ్నించిరి. వారిమాటలయందు లక్ష్యము లేనివానివలెవాఁడు "మాపార్వతమ్మగారె!"యని చెప్పఁగా, కొందఱు స్త్రీలు నవ్విరి. "పార్వతమ్మగారెచటివారు? వారిదేదేశము?"అని యాయంగన లడిగినపుడు, "వారిచటివారె-తూర్పుపుట్టిల్లు, పడమట అత్తిల్లు!" అని బాలుఁడు మాఱుపలికెను. "నీవామెను చూపింపఁగలవా?" యని వారడుగఁగా, "మీరావిడను జూపించిన నేనును జూపించెదను" అని వాఁడనెను. "నీకామె యేమగును? నీవెప్పుడు ఆవిడను జూచినట్టు కనిపించదే!"యని వారనఁగా,"ఆవిడ మాఅమ్మ. నేనుమాత్రముచూడలేదు!" అని పిల్లవాఁడు ప్రత్యుత్తరమిచ్చెను—ఈప్రసంగమునుబట్టి వాఁడు కొంటెవాఁడో పిచ్చివాఁడో యైయుండునని యాముదితలు స్థిరపఱుచుకొని, చోరబాలకులిట్లె నటింతురని వినియున్నారు కావున, వానిని రక్షకభటుల కప్పగింపవలెనని తలఁచుచుండిరి.

ఈ సంభాషణము చెవులు సోకుచున్నను తాఁజదువు పత్త్రికమీఁదనే ధ్యానముంచుకొని దూరముననున్న యొకజవరాలు వలదని తక్కినవారిని వారించి, తనయొద్దకుఁబిల్లవానిని రమ్మనెను. వాఁడపు డాస్త్రీనిసమీపింపఁగా,"నిన్నెవరు పంపిరి? ఎందుకు వచ్చినావు?"అని వానినామె మెల్లఁగనడిగెను. "నన్ను మానాన్న పంపినాఁడు—పార్వతమ్మగారికొఱకు" అని వాఁడుచెప్పిన సమాధానము మఱియొకస్త్రీ కింకను పిల్లవానిమీఁద సందియములు పుట్టించియుండును కాని, పార్వతీభాయిమాత్రము, ప్రియవియోగము మొదలు శాంతమునే పరమధర్మముగ గ్రహించి యుండుటచేత, పిల్లవానిని బెదురఁగొట్టక, నేర్పరితనముతో నింకను వానితో ముచ్చటించెను. పార్వతీభాయి లాలనకుఁ గలకఁదేఱి బాలకుఁడిపుడు సరియగు సమాధనము లిచ్చునటు లామెకుఁదోఁచెను. పిల్లవానిసంగతి విడిచిపెట్టి,తక్కినకాంతలు తమ పనులలోఁ దాముండిరి. పార్వతీభాయి సావకాశముగ వానితో ముచ్చటింపఁగలిగెను. ప్రసంగధోరణిని, ఆపిల్లవాఁడు, తన్నుఁబంపిన యాయన తన నాయనయనియును, మిగుల దయగలవాఁడనియును, కొన్నిదినములక్రిందటఁ దన్ను కొందఱు బాధింపఁగా, ఆయనయే తన్నురక్షించెననియును గ్రహింపఁగలిగెను. అపుడు వారిరువురికిని ఇంకఁ గొంత సంభాషణముజరిగెను.

పార్వ:—"ఐతే. నీవుచూడఁగోరు పార్వతమ్మను నీవానవాలు పట్టఁగలవా?"

బాల:—"పట్టలేకేమి!"

పార్వ:—"పార్వతమ్మను నేనే. ఇప్పుడేమి చెప్పెదవు?"

బాల:—"మీచేయి చూపించండి"

పార్వ:—"ఇదుగో నాచేయి"

బాల:—"ఎడమచేతివ్రేలికి ఉంగరము ఆనవాలున్నదే. ఉంగరమేదీ?"

పార్వ:—"అదెవరో దొంగ ఈసున్యవెత్తుకొని పోయినాఁడు."

పార్వతికనుల కపుడు చోద్యముసురీతిని, ఆపిల్లవాఁ డొకయుంగరము తన చొక్కాజేబునుండి తీసి చూపించెను. అది యామె పోఁగొట్టుకొనినదే! "ఇది నీదగ్గఱ కెట్లు వచ్చినది?" అని యాతురతతో నాయంగన యడుగఁగా, పిల్లవాఁడు తానే దొంగిలించితిననియు, ఆసందర్భమునను రక్షకభటులు తన్ను శిక్షించుచుండఁగా, తననాయన యడ్డువడి కాపాడెననియు, నాఁటినుండియు తాను దొంగతనము వదలిపెట్టితిననియుఁ జెప్పెను.

తనపేరు వానికిని, వానినాయనకును ఎట్లుతెలిసినని పార్వతీభాయి యడుగఁగా, "మీపేరీయుంగరమునఁ జెక్కఁబడినదట" అని బాలకుఁడుచెప్పెను. ఏదో బహుమానమిచ్చి, పిల్లవాని నంపివేయఁ జూచు పార్వతీభాయితో నపుడు "మీరు మాఅమ్మగారగు పార్వతమ్మగారివలె కనఁబడడము లేద"ని పిల్లవాఁడు పలికి, ఆయుంగరము పూర్వము తమనాయన అమ్మగారికై చెన్నపట్టణములో చేయించినారని చెప్పెను! అందుచేత పార్వతీభాయి గుండెలు తటతటఁ గొట్టుకొనసాగి, యింకను వానితో నిట్లు ప్రసంగించెను.

పార్వ:—"మీనాన్నగారి నివాసస్థల మేయూరు?"

బాల:—"కొండవీటి సీమ"

పార్వ:—"మీనాన్నగారితోఁ గలసి అమ్మగారు లేరని చెప్పితివి-దీనికి హేతువేమి?"

బాల!—"కోపమువచ్చుటచేత"-

పార్వ:—"మీనాయన మీఅమ్మగారిని గుఱించి యిపు డేమనుకొను చున్నారు?"

బాల:—"మంచివారగనిన్ని, త్వరలోఁగలసి కొందుమనిన్ని చెప్పుచున్నారు."

ఈకడపటి వాక్యము వినువప్పటికి పార్వతి సందియములు వీడిపోయెను. ఇన్నాళ్లకు భర్తసమాచారము తెలిసెనని యానారీమణి కానందాశ్రువులు కన్నులనుండి స్రవించెను. ముద్రికమూలమున రామాయణమునందువలెనే తనకును బతికిని సమావేశము చోద్యముగఁ గలిగినందునకుఁ బార్వతి యానందపరవశ యయ్యెను. భర్త యిపుడు తిరిగి తనయందు సదభిప్రాయముగలిగి యుండుటకు పార్వతి మిగుల సంతసించెను. ఈమానినియె తాను వెదుకవచ్చిన పార్వతమ్మయని తెలిసికొనిన బాలకుఁ డంత, చిరకాలము నకుఁదల్లినిజూచిన పుత్త్రికునివలెఁగన్నీరు రాల్చుచు, ఆమె పాదములమీఁద వ్రాలెను. పార్వతి సొమ్మునపహరించుట నెపముగాఁ దాను సన్మార్గము చూరఁగలిగితినని బాలుఁడాసాధ్వీమతల్లితోఁ జెప్పి, యుంగరమామెకిచ్చి, దీవెనలు వడసెను.

౧౦. వీడుకోలుపు

చ. అమృతకరాంశుతుల్యమగు హారము రాముఁడు సీతకిచ్చె న్నా,రమణిధరింపనొల్లక కరంబులఁదాల్చి నిజేశుడ భూ, రమణుఁడు నింతికన్నెతెఁగి రాగముతో నగుఁగాకయన్న స, క్కమలదళాక్షి వాయుజానికంఠమునం దగిలించె వేడుకన్.

—భాస్కరరామాయణము.

దేశీయమహాసభ ముగిసిన మఱునాఁటి యుదయమున, అన్యత్కాని గుడారమున నొక చిన్నసభ జరిగెను. ప్రముఖులలో ననేకులు కాకినాడ విడిచిపోవుటచేత, కొలఁదిమందియే యాసభ నలంకరించిరి. ఆసభ ముఖ్యోద్దేశము, ఐచ్ఛిక సేవకులలో శ్లాఘనీయముగఁ బనులు చేసినవారిని బహూకరించుటయే. సభామంటపము, సుందరపుష్పములతో నలంకరింపఁబడెను. శ్రీమతి సరోజినీదేవి యగ్రాసనాధిపత్యము వహించెను.

ఐచ్ఛికసేవాసంఘములో నెల్ల ప్రథమస్థాన మొక యువకుని కీయవలయునని సరోజినీదేవి వక్కాణించి దేశభక్తుని బిలిచి, వాని కతని పేరుతెలిపి వానిని గురించి కొన్నిసంగతులు చెప్పుమనికోరెను. దేశభక్తుఁడంత నీయువకుఁడు ఆంధ్రుఁడగుటకేకాక తన సొంతదేశమగు గుంటూరుమండలపువాఁ డగుటకును దా నుప్పొంగుచున్నా నని పలికి యిట్లుపన్యసించెను.

"కొండవీఁడు పూర్వపురాజ్యములలోఁ బేరెన్నికగన్నను దురదృష్టవశమున నేఁటివారిచే నాప్రాంతపువారనాగరికులని భావింపఁబడుచున్నారు. ఇది సత్యము గాదు. నిజమగు నాగరకతను పైమెఱుగులనుబట్టికాక, ఆత్మగుణములనుబట్టియె నిర్ణయింపవలయును. కొండవీటిసీమనివాసియగు విశ్వనాథము విద్యాధికతచేతను, దేశహితైకకార్యదీక్షచేతను నొప్పెడివాఁ డయ్యెను కొన్ని కుటుంబసందర్భములచేత బోల్పూరు శాంతినికేతనముఁ జేరి, యచట దైవానుగ్రహమువలనను, ఆంధ్రమాసుగారి సుబోధమూలముననను మరల నాత్మశాంతి గాంచి యిపుడు స్వదేశమునకుఁ బోవుచున్నాఁడు.

"మార్గమధ్యమందలి కాకినాడపట్టణమున దేశీయసభాసమావేశ సందర్భమున దేశసేవ చేయఁగోరి విశ్వనా

థము, పేరునకు ఇచ్ఛికభటు సమూహమునఁ జేరకున్నను, వారితోఁగలసి ప్రజాసంరక్షణార్థమై పరిశ్రమఁజేసి కృతకృత్యుఁడయ్యెను. పట్టిశిక్షయె యపరాధిని బాగుపఱుచునని నమ్మక, ప్రేమమార్గమె యపరాధి కాత్మోజ్జీవనమొనరించునని నమ్మి, కార్యసాధనమున విజయము గాంచిన ధీరుఁడీతఁడు. కావుననే చిన్నఁనాటనుండియు చార్యమున కభ్యాసపడిన పిల్లవాఁడొకఁడు వీరిదయకుఁబాత్రుడై సన్మార్గమునఁ జొచ్చెను. విశ్వనాథముగారికి ముందు గలుగనున్న శుభములకు సూచనగ వీరితోఁ గొంతకాలము నుండి విడివడియున్న వీరి ధర్మపత్నికిని వీరికి నిచటఁ దిరిగి సమాగమమును,ఐక్యమును గలిగినవి. ఈదంపతులకు సర్వశుభములు చేకూఱునుగాక!"

దేశభక్తుని వచనముల కామోదించుచు, సరోజినిదేవి యంత ఐచ్ఛిక సేవకురాండ్రలో పార్వతి మిగుల యోగ్యతగల యువతీరత్నమని యిట్లు వాక్రుచ్చెను:—

"దైవముఖముచూచియో యీవనిత సేవాకార్యముల నిర్వర్తించెను. ఈసందర్భమునఁ బార్వతికి గలిగిన సాంసారిక కష్టములను గురించి యించుక సూచించెదను. హిందూదేశమును, కోడండ్రు వెతనొందు దేశమని వ్యవహరింపవచ్చును. అందులోను తెలుఁగువారి కోడండ్ర మగుమేము ఎక్కువచిక్కుల పాలగుచున్నాము. ఇట్లనుటవలన ఆంధ్రులు దుశ్శీలురని నామతముగాదు. వారు భరతఖండమును జిరకాలమేలిన రాజులసంతతివారు. ఉదారతాచిహ్నములు వారిసుగుణములం దిప్పటికిని గానవచ్చుచున్నవి. మతసాంఘికాది విషయములందు వీరు ప్రస్తుతము మనదేశమున ముందడుగు వేయుచున్నారు.

"పార్వతీ విశ్వనాథులు, తమ బాల్య కాలపు కుటుంబ కలహములకుఁ బ్రాయశ్చిత్తముగ నొకసంవత్సరము వేర్వేఱు ప్రదేశములందు తపస్సు సలిపి, మనఃపరిపాకము నొందిరి. యిపుడొక్కటియై జన్మభూమి నుద్ధరింపఁ బూనుచున్నారు- నాకుఁ దీక్ష గలిగినచో ఈదంపతుల విచిత్రచరిత్రము ప్రబంధరూపమున నిబంధింప నువ్విళ్లూరుచున్నాను. దైవము వీరల కన్నియైశ్వర్యములు నొసంగవలయును".

నల్లనివిూసము గడ్డమును దనబంగరు తనుచ్ఛాయ కొకవింత యందమొసఁగ, ఋషిపుత్త్రికునివలెఁ దేజరిల్లు విశ్వనాథము, తన కొసఁగఁబడిన పసిఁడిపతకము వందనపూర్వకముగనందుకొని, సతీతిలకము చేత నుంచెను. స్వదేశ చీరధరించి, రమ్యముగ తెల్లకలువపూవులతె నావేదిక నలంకరించిన పార్వతి, సరోజినీహస్తదత్తమగుపుష్పహారమును తమ యభిమానపుత్త్రుని మెడలోనవైచి, ఆతని మూలమునఁ బోయినను పావనములైన యాతని చిన్నిచేతులతోనె మరల తనకు లభించిన చిరకాల సఖియైన ముద్రికయే తనకుఁ జాలుననియెంచి, ఇపుడు తనకుఁ బారితోషికముగ నీయఁబడిన రవలయుంగరమును పవిత్రమార్గమునకు మరలిన బాలకుని చిన్నివ్రేలికిఁబెట్టి ముద్దుపెట్టుకొనెను. తన మెడలోని పుష్పహారమును, వ్రేలియుంగరమును జూచుకొని బాలకుఁడు మురియుచు తల్లిదగ్గఱ గూర్చుండెను.